# నాగరాజీయమ్

రాయసం వెంకట్రామయ్య

## పులివేట

విశాఖపట్నం నుండి ఉత్తరం వచ్చిన మూడోరోజుకి టిక్కెట్టు కొన్నాడు నాగరాజు. నాగరాజు మేనత్త రామలక్ష్మిగారికి జబ్బుచేసి నయమైందని ఆవిడ కొడుకు కొండల్రావు రాసాడు ఉత్తరం.

రైలు దిగి రిక్షాలో సీతమ్మధార వెళ్లేసరికి ప్రొద్దెక్కిపోయింది. అక్కడ కొండల్రావు ఓ ఫ్లాటు కొన్నాడు. ఆ కాంప్లెక్స్‌లో మొత్తం ఎనిమిది ఫ్లాట్లే ఉన్నాయి. చుట్టూతా చాలా స్థలం విడిచిపెట్టి కట్టారు. నాలుగైదు పెద్ద పెద్ద చెట్లు ఉంచడంతో కళ్లకి ఇంపుగా ఉంది. కొండల్రావు ఫ్లాటు మొదటి అంతస్తే. బాల్కనీకి ఎదురుగా పెద్ద వేపచెట్టు ఉంది.

''బావా! మీ ఇల్లు బాగుందిరా'' అన్నాడు నాగరాజు రాగానే.

''ఎలా ఉన్నావురా నాగూ? నీ భార్యాపిల్లల్ని తీసుకురాలేదేం?'' అంది రామలక్ష్మిగారు.

''పిల్లలకి శనివారం కూడా స్కూళ్లు. అదీకాక ఓ రోజుకీ, రెండ్రోజులకీ ఏం తీసుకురానని ఊరుకున్నాను. నీ వంట్లో ఎలా వుందిప్పుడు? బాగా నీర్సపడి నట్టున్నావత్తయ్యా'' అన్నాడు నాగరాజు.

''వయస్సు మీదికొస్తుంటే నీర్సపడక బలంగా ఉంటామా? నిన్ను చూస్తే మా అన్నయ్యనీ, వదినీ చూసినట్టుందిరా'' అంటూంటే రామలక్ష్మిగారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

నాగరాజు స్నానం, జపం ముగించేసరికి భోజనం తయారుగా ఉంది. మేనత్త చేసిన సొజ్జప్పాలు అవీ తింటూంటే నాగరాజుకి వాళ్లమ్మ వంట గుర్తొచ్చింది.

కొండల్రావు మడత మంచంవేసి ఫాను కూడా వేశాడు. రాత్రి సరిగ్గా నిద్ర పట్టక నాగరాజు బాగా అలసిపోయాడు. సొమ్మసిల్లి నిద్రపోయాడు.

నాగరాజు లేచేసరికి నీరెండగా ఉంది. రామలక్ష్మిగారు, సరళ టీవీలో తెలుగు సినిమా చూస్తున్నారు డ్రాయింగ్ రూమ్‌లో. కొండల్రావు పనిమీద బైటకు వెళ్లాడు. రవి వేపచెట్టు క్రింద మట్టిలో ఆడుతున్నాడు. నాగరాజు వొళ్లు విరుచుకుని బాల్కనీలో నుంచొని క్రిందకు చూసాడు.

వేపచెట్టు చాలా పెద్దది. కొన్ని కొమ్మలు బాల్కనీకి దగ్గరగా ఉన్నాయి. కొండల్రావు కొడుకు రవి, వాడి స్నేహితుడు అరుస్తూ ఆటసాగిస్తున్నారు. ఉన్నట్టుండి వేపచెట్టుమీద ఏదో కదిలినట్టయింది. నాగరాజు కళ్లు అటు వైపు తిరిగాయి.

అప్పుడు కనబడింది నాగరాజుకి చిరుతపులి. వీడి ముఖంలోకి చూసి పళ్లు చూపించింది. చిరుత నాగరాజుని చూసి కొంచెం కళవళపాటు పడింది. కొమ్మపైనే కొంచెం వెనక్కి కదలబోయింది. వెంటనే నాగరాజు బాల్కనీ తలుపు మూసేసి కిటికీలోంచి చిరుతని గమనించాడు. అది నాగరాజు లోపలికెళ్లగానే స్థిమితపడింది. కానీ క్రింద చిన్నపిల్లలిద్దరూ చేసే రొదకి చికాకు పడుతున్నట్లుగా చూసింది చెట్టుక్రిందకు.

నాగరాజు గుండె చాలా జోరుగా కొట్టుకుంది. వాడికి మెరుపులా ఒక ఆలోచన తట్టింది. నాలుగైదు అంగల్లో ఫ్లాట్లోంచి బైటకొచ్చి మెట్లు దిగాడు. రామలక్ష్మిగారు ''నాగూ! ఎక్కడికి వెళ్తున్నావు?'' అని అడిగింది.

''ఇప్పుడే క్రిందకెళ్లి వస్తానత్తయ్యా'' అంటూనే మెట్లు దిగిపోయాడు. సరాసరి వెళ్లి రవిని ఎత్తుకుని వాడి స్నేహితుడితో ''మీ ఇంటికి వెళ్లిపో. పులి వస్తుంది'' అని వాడ్ని వాళ్ల ఫ్లాటు దగ్గర దించేసాడు. రవిని ఎత్తుకుని పైకి వస్తుంటే వాడు పెద్దగా ''నేనాడుకుంటా. నన్నొదులు'' అంటూ మారాము చేశాడు.

వాడి కేకలకి రామలక్ష్మిగారు, కోడలు సరళ గుమ్మం దగ్గర కొచ్చి 'ఏమిటి జరుగుతోందా?' అని చూస్తున్నారు. రవిని ఎత్తుకుని నాగరాజు లోపలికొస్తుండగా రామలక్ష్మిగారడిగింది ''ఎందుకురా నాగూ వాడ్ని తీసుకొచ్చావ్? ఆడుకోనీ వాడ్ని.''

నాగరాజు రవిని దించి వెంటనే తలుపులు దగ్గరగా వేసి ''నా వెనకాలే రండి. గట్టిగా మాట్లాడకండి'' అని తను పడుకున్న గదిలోకి తీసుకెళ్లాడు వాళ్లందర్నీ. వింత చూడబోయి రవి కూడా జరిగింది మర్చిపోయి నాగరాజు వెనుకే వచ్చాడు. కిటికీ గాజు తలుపుల్లోంచి నాగరాజు వేపచెట్టుపైను చూడమని సంజ్ఞ చేశాడు. అందరూ ఆశ్చర్యంగా చూసారు. చిరుతపులి అప్పటికి బాల్కనీకి ఆరు, ఏడు అడుగుల దూరంలో ఉంది కొమ్మమీద.

రామలక్ష్మిగారు వెంటనే ''అయ్యబాబోయ్ చిరుతపులి చెట్టెక్కి కూర్చుంది. ఇంకా నయం చిన్న కుర్రాడ్ని ఏం చేసేదో నాగు తీసుకురాకపోతే'' అంటూ భయపడిపోతూ అంది.



సరళ ఖంగారుగా ''అన్నయ్యగారూ! ఇప్పుడేం చేయాలి? బైటకెళ్లిన మనిషి ఇంకా రాలేదు?''

నాగరాజు ఓ క్షణం ఆలోచించి ''నేను ఓసారి బైటకెళ్లివస్తాను. మీరు ఫ్లాట్లోంచి కదలకండి. ఓ గట్టి తాడు ఏదైనా ఉంటే చూసి ఉంచండి అత్తయ్యా!'' అన్నాడు.

నాగరాజు గబగబా ఫ్లాటు బైటకు నడిచాడు. మిగతా ఏడు ఫ్లాట్ల వాళ్లందరికీ వేపచెట్టు మీద చిరుతపులి వున్నట్టు, తలుపులు జాగ్రత్తగా వేసుకోమని చెప్పాడు. ఇద్దరు ముగ్గురు నాగరాజు వెనకాలే వచ్చారు కర్రలూ అవీ పట్టుకుని. వాళ్లల్లో ఒకడికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో చెప్పమన్నాడు. మరొకడ్ని ఫ్లాట్లో ఉండి వచ్చేవాళ్లకి నెమ్మదిగా చిరుతపులి విషయం చెప్పమన్నాడు.

ఫ్లాట్లలో వున్నవాళ్లందరూ పన్లు మాని కిటికీల దగ్గర, బాల్కనీల్లో చేరి చోద్యం చూడసాగారు.

పది నిముషాల్లో పోలీసులు వచ్చారు. వాళ్ల వెనక మరికొంతమంది జనం వచ్చారు. వీళ్లందరూ వచ్చి గేటు దగ్గర గుమిగూడారు. జూ వాళ్లకి, అటవీ శాఖ వాళ్లకీ తెలియజేయడానికి ఏర్పాటు చేసారు పోలీసులు.

ఇంతలో స్కూటరుమీద కొండల్రావు వచ్చాడు. అతడ్ని చూసి రవి ''నాన్నా! చిరుతపులి వచ్చింది. చెట్టుమీద కూర్చుంది'' అంటూ అరిచాడు. పోలీసులు ఎవర్నీ లోపలికి రానివ్వడంలేదు.

ఈ గోలంతా విని చిరుతపులి బెదిరిపోయింది. ఎప్పుడు తలుపు తీసాడో రవి తలుపు తీసి మెట్లు దిగి పరుగెత్తాడు. అప్పుడే చిరుత లేచి క్రిందకి చూస్తోంది.

''రవీ...రవీ ఆగరా'' అంటూ సరళ వాడివెనకాలే దారి తీసింది.

రవి సరాసరి పరుగెత్తుకుంటూ వాళ్ల నాన్న దగ్గరకెళ్లిపోయాడు. సరళ మెట్లు దిగి పోర్టికోలోకి వస్తుండగా చిరుత క్రిందకు దిగే యత్నంలో వున్నట్లు అనిపించింది.

నాగరాజు రామలక్ష్మిగారితో ''అత్తయ్యా! వీధి తలుపు వేసి లోపలే వుండు. నేను బాల్కనీలోకి వెళ్తాను'' అని నెమ్మదిగా శబ్దం కాకుండా బాల్కనీ తలుపు తీశాడు. పాకుతూ కొమ్మమీది చిరుతపులికి కనబడకుండా బాల్కనీలో ప్రవేశించాడు నాగరాజు. బాల్కనీ తలుపు బైటనుండే వేశాడు.

వాడి చేతిలో ప్లాస్టిక్ నవారు ఉంది. కొండల్రావు ఇంట్లో ఇనుప మంచానికి వెయ్యడానికి కొన్న నవ్వారు అది. తాడు దొరక్క నాగరాజు దాన్ని పట్టుకెళ్లాడు. ఓ కొసకి జారుముడి వేసి క్రిందకు దిగబోతున్న చిరుతపులి మెడలో పడేట్లు విసిరాడు నాగరాజు బాల్కనీలోంచి. తాడు మీద పడేసరికి పులి ఉలిక్కిపడి చిన్నగా గాండ్రించింది. అలా అరిచి వెంటనే క్రిందకు దిగింది ఒక్క గంతులో చిరుతపులి.

త్రుటిలో నాగరాజు ప్లాస్టిక్ నవ్వారు మరో కొస కిటికీ ఊచకి కట్టేశాడు. పదిమీటర్ల నవ్వారు కొస పులి మెడకి బిగిసిపోయింది. అది పెనుగులాటలాడి పెద్దగా గాండ్రించింది. అక్కడ గుమిగూడిన జనం ఎక్కడివాళ్లక్కడే పారిపోయారు. సరళ భయంతో వణికిపోతూ పైకి వచ్చి ఏడ్పు మొదలుపెట్టింది. ఆమెని చూసి రామలక్ష్మిగారు కూడా విషయం తెలియక ఏడ్చింది. పులి పెనుగులాడినా ప్లాస్టిక్ నవ్వారు తెగలేదు. నాగరాజు వేసిన ముడి గట్టిగానే ఉంది. కిటికీ ఊచలకి కట్టిన కొస గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు నాగరాజు.

ఓ ఇరవై నిముషాలసేపు పెనుగులాడి అలసిపోయింది చిరుతపులి. ఫ్లాట్లలో వున్నవాళ్లంతా వణికిపోయారు.

కొంతసేపటికి అటవీ శాఖవాళ్లు, జూ వాళ్లు సెర్చిలైట్లతో సహా వచ్చి పులికి మత్తుమందిచ్చి తీసుకువెళ్లారు వానులో.

అందరూ నాగరాజుని అభినందించారు. రామలక్ష్మిగారు నాగరాజుకి ఉప్పు దిగదుడిచింది. ★